నులిపురుగులను నివారిద్దాం

- మాత్రలను పిల్లలకు వేయించాలి
- ఈ నెల 20న జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 15 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం తల్లిదండ్రులు తమ పిల్లలకు, విద్యార్థులకు ఈ నెల 20న నులి పురుగుల నివారణ మాత్రలైన ఆల్బెండజోల్ వేయించాలని సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ నెల 20న జరగనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్బెండజోల్ మాత్రల పంపిణీ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగుల కారణంగా ఎదురయ్యే ఆరోగ్యపరమైన సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఒకటి నుంచి 19 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న చిన్నారులు, విద్యార్థులు 4లక్షల 5 వేల 207 మంది ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో గురుకులాలు, కేజీబీవీ వసతి గృహాలలోనూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. 20న తప్పిన వారికి 27న విధిగా మాత్రలు వేయించాలని స్పష్టం చేశారు. ఒకటి నుంచి ఐదేండ్ల లోపు పిల్లలు అంగనాన్‌వాడీ పరిధిలోకి వస్తారని, వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సీడీపీవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, సంబంధిత అధికారులు నులి పురుగులతో వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య వాహనాలతో విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతగా ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలందరికీ వేయించాలన్నారు. అనంతరం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, డీఈవో వెంకటేశ్వర్లు, డీఐఏవో గోవింద్‌రామ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

హరీశ్‌రావును కలిసిన బొల్లారం నేతలు

బొల్లారం, జూన్ 15 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావును నగరంలోని ఆయన నివాసంలో బొల్లారం మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావును నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం మున్సిపాలిటీ జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. మాజీ ఎంపీటీసీ యాదగిరి గౌడ్, నేతలు ఉన్నారు.

హరీశ్‌రావును కలిసిన బొల్లారం బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి

త్వరలో షాపింగ్ కాంప్లెక్స్ పనులు పూర్తి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న దుకాణ సముదాయం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూన్ 15 : త్వరలోనే మార్కెట్‌లో షాపింగ్ కాంప్లెక్స్ పనులు పూర్తి చేస్తామని పటాన్‌చెరు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరులో వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న దుకాణ సముదాయాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరు మార్కెట్ యార్డును త్వరలోనే ఆదర్శ మార్కెట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. 14 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో అన్ని రకాల వసతులతో మార్కెట్ యార్డును ఏర్పాటు చేశామని,168 దుకాణాలను షాపింగ్ కాంప్లెక్స్‌లో నిర్మిస్తున్నామని వెల్లడించారు. ఇందు కు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశామన్నారు. మార్కెటింగ్ ఏడీ మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుణాల పంపిణీలో డీసీసీబీకి అవార్డు

సంగారెడ్డి, జూన్ 15 : వ్యవసాయ పరపతి సహకార కేంద్ర బ్యాంకు జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు భారీ మొత్తంలో రుణాలు అందజేసినందుకు రాష్ట్రస్థాయి డీసీసీబీ బ్యాంకు అవార్డును మంత్రి సీతక్కతో చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అందికున్నారు. శనివారం హైదరాబాద్‌లోని మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో పంచాయతీరాజ్, శిశు సంక్షేమం, నీటిపారుదల శాఖల మంత్రి సీతక్క చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డును అందుకున్నారు. అనంతరం జిల్లాకు చెందిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మంత్రి దామోదర్ రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిసి మెమోంటోను బహూకరించారు. చైర్మన్‌తో పాటు బ్యాంకు సీఈవో శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

మంత్రి దామోదర్ రాజనర్సింహకు మెమొంటోను అందజేసిన చైర్మన్, సీఈవోలు

టీబీ వ్యాధి నిర్మూలనకు పరిశ్రమల్లో అవగాహన

పటాన్‌చెరు, జూన్ 15 : టీబీ వ్యాధి నిర్మూలనకు పరిశ్రమల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని టీబీ అలర్ట్ ఇండియా ప్రతినిధి డిస్ట్రిక్ ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణ అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామ పరిధిలోని హింద్ వేర్ లిమిటెడ్ పరిశ్రమలో జిల్లా క్షయ వ్యాధిని ర్మూలన కార్యక్రమం సిబ్బంది ఆధ్వర్యంలో టీబీపై అవగాహన కల్పించారు. జిల్లా క్షయ నిర్మూలన కార్యక్రమ సిబ్బంది దేవేందర్ రాజ్, టీబీ అలర్ట్ ఇండియా డిస్ట్రిక్ట్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ రోడ్డుపై నిరంతర వరద

పట్టించుకొని మున్సిపల్ అధికారులు

సంగారెడ్డి, జూన్ 15 : కొన్నేండ్లుగా జాతీయ రహదారిపై వర్షపు నీరు, మురుగు నీరు ప్రవహిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సంగారెడ్డి గ్రేడ్-1 మున్సిపాలిటీలో విలీనమైన పోతిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కంది శివారు నుంచి నిరంతరంగా పారుతున్న వరద, మురుగు నీటిపై అధికారులు స్పందించడం లేదని రహదారిపై ప్రయాణించే వారు ఆరోపిస్తున్నారు. అసలే వర్షకాలం అందులో విషజ్వరాలు ప్రభలే తరుణంలో అధికారులు స్పందించి మురుగు నీరు రోడ్డుపై పారకుండా కాల్వ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డుపై పారుతున్న మురుగు నీటి ప్రవాహం

చెరువులను పరిరక్షించుకోవాలి

రామచంద్రాపురం, జూన్ 15 : చెరువులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ అన్నారు. శనివారం తెల్లాపూర్‌లోని చెలికుంట చెరువు పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని టీనా ఆధ్వర్యంలో గేటెడ్ కమ్యూనిటీ వాసు లు తొలిగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ తెల్లాపూర్ పరిధిలో ఉన్న మేళ్ల చెరువు, చెలికుంట, వనం చెరువు పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. చెరువులను రక్షించుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, భూగర్భజలాలు మెరుగుపడుతాయని పేర్కొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాయికోడ్ ప్రాథమిక వైద్యాధికారి నికిలా

రాయికోడ్, జూన్ 15 : చిన్నారులకు తప్పకుండా నులిపురుగుల మాత్రలు వేయించాలని రాయికోడ్ ప్రాథమిక వైద్యధికారి డాక్టర్ నికిలా అన్నారు. శనివారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఉన్న ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి అధికారులు, అంగన్‌వాడీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో రాయికోడ్ ప్రాథమిక వైద్యధికారి డాక్టర్ నికిలా మాట్లాడారు. వివిధ కారణాలతో ఎవరైనా చిన్నారులు మాత్రలు వేసుకోకుంటే 27న వేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

బడిబాటలో భాగంగా కందిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కంది, జూన్ 15 : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దామని కంది జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం కందిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న విద్య, మౌలిక వసతులపై నినాదాలు చేస్తూ అవగాహన పెంచారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత, 9.0 నుంచి 9.7 గ్రేడ్ సాధించిన విద్యార్థుల ప్లెక్సీతో ర్యాలీని కొనసాగించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ధర్నాలో బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు మారుతీయాదవ్

న్యాల్‌కల్, జూన్ 15 : హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో తలపెట్టిన బీసీ మహాధర్నాను శనివారం తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం, బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మారుతీ యాదవ్ ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డిలో కాంగ్రెస్ చేసిన బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీ కులగణనను వెంటనే చేపట్టి, స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న 20 శాతం రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీ తీరుపై స్థానికుల ఆగ్రహం

బొల్లారం, జూన్ 15 : బొల్లారం పారిశ్రామికవాడలో గ్యాస్ అమ్మకాలు అధిక ధరలకు అమ్ముతున్నారంటూ స్థానిక బీజేపీ నాయకులు, సంఘసేవకులు ఆనంద్ కృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్వీఎస్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సిలిండర్ ధర 855 రూపాయలు కాగా, అదనంగా మరో 100 రూపాయలు వినియోగదారుల నుంచి తీసుకోవడమే కాకుండా ఇంటికి డెలివరీ చేయకుండా ఏజెన్సీ వద్ద నుంచే విక్రయాలు చేస్తున్నారని మండిపడ్డారు. గ్యాస్ సిలిండర్లు నేరుగా ఇంటి వద్దకే పంపించాలని సూచించారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకొని సామాన్య ప్రజలకు న్యాయం జరిగేలా విజ్ఞప్తి చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులను వెంటనే అందజేయాలి

ఎంపీపీ పాలక వర్గ సభ్యులను సన్మానిస్తున్న మండల అధికారులు

న్యాల్‌కల్, జూన్ 15 : షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు వెంటనే అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజాప్రతినిధులు కోరారు. శనివారం మండల కేంద్రమైన న్యాల్‌కల్ ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌తో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీనికి నోచుకోలేదని, వాటిపై గడువు తేదీ ముగియడంతో తిరిగి కొత్త చెక్కులు మండలానికి వచ్చాయన్నారు. దీంతో వైస్ ఎంపీపీ గౌసొద్దీన్ మాట్లాడుతూ గతేడాది నుంచి లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు గైర్హాజర్ కావడంతో మిగిలిన పలు శాఖాల అధికారులు తమ నివేదికలను చదువుతూ మమా అనిపించారు. అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీలు అంజమ్మ, గౌసొద్దీన్ మాట్లాడుతూ గత ఐదేండ్లుగా ఎంపీపీ పాలక వర్గ సభ్యులుగా కొనసాగుతూ మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశామన్నారు. ప్రభుత్వ పథకాల కింద మంజూరైన నిధులతో గ్రామాలను అభివృద్ధికి శాయశక్తుల కృషి చేశామన్నారు. అఖరి మండల సర్వసభ్య సమావేశం కావడంతో మండల అధికారులు ఎంపీపీ పాలక వర్గ సభ్యులను సన్మానించారు. ఎంపీడీవో సురేశ్, అర్‌డబ్ల్యూఎస్ డీఈ సాబెర్‌హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, పీఆర్ ఏఈ కృష్ణ, ట్రాన్స్‌కో ఏఈ అర్జున్, ఏవో లావణ్య, ఏపీవో కుమార్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గ్రామైక్య సంఘానికి రాష్ట్రస్థాయి అవార్డు

అవార్డును అందజేస్తున్న మంత్రి సీతక్క

హత్నూర, జూన్ 15 : మండలకేంద్రమైన హత్నూర మహిళా గ్రామైఖ్య సంఘానికి రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. శనివారం హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో హత్నూర మహిళా గ్రామైఖ్య సంఘానికి రాష్ట్ర మంత్రి సీతక్క, పంచాయతీరాజ్ కార్యదర్శి సందీప్ కుమారి సుల్తానియా అవార్డులను అందజేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో హత్నూర గ్రామ సంఘానికి 99 లక్షల బ్యాంకు లింకేజీ టార్గెట్ ఇచ్చినప్పటికి రూ.4 కోట్ల 3 లక్షల బ్యాంకు లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించడంతో పాటు వందశాతం రికవరీ చేయించడం ద్వారా అవార్డుకు ఎంపికయ్యింది. సీసీ మహేశ్, వీవోఏ లక్ష్మయ్యకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అవార్డులను బహూకరించారు.

బంగారం పేరుచెప్పి ఇద్దరు వ్యక్తులకు టోకరా

వర్గల్,జూన్15 : బంగారం పేరు చెప్పి నకిలీబంగారం అంటగట్టి ఇద్దరు వ్యక్తులకు టోకరా పెట్టిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా పుంగనూర్ నియోజకవర్గం శికారుపాలెం, పాళ్యంపల్లి, రాయచోటి గ్రామాలకు చెందిన ఎం.అదెప్ప, ఇంద్రరాజు, మహిమరాజు, శివకృష్ణ,రాజధాని, ఎం,నాయక్, చిన్న కలిసి జేసీబీ సాయంతో మట్టిని తవ్వే సమయంలో తమకు బంగారం హారం దొరికిందని, దానిని తక్కువ ధరకు అమ్ముతామని చెబుతూ పలుప్రాంతాల్లో అమాయకులను బురిడీకొట్టిస్తూ మోసంచేయడమే పనిగా అలవాటుపడ్డారు. ఇదే క్రమంలో ఒక వర్గల్ మండలం గౌరారంలోని సెవన్‌హిల్స్ వద్ద టీతాగే క్రమంలో జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామపంచాయతీ పరిధిలోని బలిజగూడానికి చెందిన స్వామికి పరిచయమైన మహిమరాజు తమవద్ద జేసీబీతో మట్టి తవ్వుతున్న క్రమంలో 3 కిలోల బంగారు హారం దొరికిందన్నారు. దానిని తక్కువధరకు అమ్ముతామని తెల్పగా స్వామితోపాటు అతడి మిత్రుడు వెంకట్ కలిసి మొత్తం రూ.20 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. ఆ తర్వాత స్వామి, వెంకట్‌లె కలిసి పుంగనూర్ సమీపంలోని ఎదిగాపల్లికి రమ్మనగా అక్కడికి వెళ్లారు. మొదట రూ.2 లక్షలు ఇవ్వగా దానికి సరిపడా బంగారం ఒరిజనల్ ఇచ్చారు. మిగతా రూ.18 లక్షలు 15 రోజు ల్లో తెచ్చి బంగారం తీసుకెళ్లాలని చెప్పారు. కాగా, మిగతా డబ్బులు తీసుకొని బంగారం తెచ్చుకున్న స్వామి,వెంకట్ కొన్నిరోజుల తర్వాత తాము తెచ్చుకున్న బంగారం నకిలీ అని తేలడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే శనివారం గౌరారం వద్ద గల రాఘవేంద్ర హోటల్‌వద్ద అదెప్ప మరోవ్యక్తితో తమవద్ద జేసీబీతో మట్టితొవ్వుతున్న క్రమంలో బంగారుహారం దొరికందని, దానిని అమ్ముతామని చెబుతుండటంతో వెంటనే సమాచారం మేరకు రంగంలోకి దిగిన సీఐ. మహేందర్‌రెడ్డి, ఎస్సై శివకుమార్ సదరువ్యక్తిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించడంతో అసలు విషయాలు బయటపడ్డాయి. మొత్తం ఆరుగురు సభ్యులు ఇదే పనిగా మోసం చేస్తూ తిరుగుతున్నారని, మిగతావారిని కూడా పట్టుకుంటామని, ప్రజలు ఇలా తుక్కువ ధరకే బంగారం అంటూ తిరిగేవారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కార్మికులకు తొలిగిన ఇబ్బందులు

కోహీర్, జూన్ 15 : జహీరాబాద్ పట్టణంలోని డిస్పెన్సరీని సంబంధిత అధికారులు శనివారం పునఃప్రారంభించారు. దీంతో రెండున్నర నెలల నుంచి నియోజకవర్గంలోని పలు పరిశ్రమల కార్మికులు పడిన ఇబ్బందులు తొలిగిపోయాయి. డిస్పెన్సరీ కేంద్రమూత పడినప్పటి నుంచి సీఐటీయూ ఆందోళన బాట పట్టింది. కార్మికులకు వైద్యసేవలు అందించాలని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లారు. ఇందుకు స్పందించిన అధికారులు కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు కేంద్రాన్ని తెరిపించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వారికి ధన్యవాదాలు తెలిపారు. జహీరాబాద్ పట్టణంలో కార్మికుల కోసం 50 పడకల దవాఖానను నిర్మించాలని డిమాండ్ చేశారు.

బాధ్యతల స్వీకరణ

న్యాల్‌కల్, జూన్ 15 : మండలంలోని మిర్జాపూర్(బి), మెటల్‌కుంట గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారిగా మండల తహసీల్దార్ భూపాల్ శనివారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామ పంచాయతీలో ప్రత్యేకాధికారిగా బాధ్యతలను చేపట్టారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నమాచార్య ఆరాధన

రామచంద్రాపురం, జూన్ 15 : భారతీనగర్ డివిజన్‌లోని బీడీఎల్ కాలనీ సమీపంలో ఉన్న పంచముఖి ఆంజనేయస్వామి ఆలయ ఆవరణంలో తాళ్లపాక అన్నమాచార్య ఆరాధన ఉత్సవాలు జరిగాయి. స్వర్ మహతి కళా పరిషత్, టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన తాళ్లపాక అన్నమాచార్య ఆరాధన ఉత్సవాలను దత్త విజయానందతీర్థ స్వామిజీ ప్రారంభించారు. ఈ ఉత్సవాల్లో కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె ఆరాధన సేవలో పాల్గొన్నారు.

ఇద్దరు ఆత్మహత్య

దుబ్బాక,జూన్15 : దుబ్బాకలో శనివారం జరిగిన వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. దుబ్బాక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లిలో ధర్మారెడ్డి సంతోష (32) వివాహిత. తల్లి గారింట్లో శనివారం మధ్యాహ్నం దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అనారోగ్యపరమైన కారణాలతోనే ఆత్మహత్య చేసకుందని భర్త నవనీత్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంతోష, నవనీత్‌రెడ్డిలది ప్రేమ వివాహం, వీరికి ఇద్దరు కుమారులున్నారు.

ఆకారంలో వృద్ధుడు..

దుబ్బాక మండలం ఆకారంలో గరిగె నారాయణ (85) వృద్ధుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణకు కొంత కాలంగా మతి స్థిమితం లేక, మానసికంగా ఇబ్బందులు పడుతున్నడని మృతుడు కుమారుడు భిక్షపతి ఫిర్యాదులో తెలిపారు. శనివారం తమ పొలంలో చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు దుబ్బాక ఎస్సై గంగారాజు తెలిపారు.

విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి

గుమ్మడిదల, జూన్15 : రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడి ఆరునెలలు గడుస్తున్నా విద్యాశాఖమంత్రిని నియమించకపోవడం విడ్డూరంగా ఉందని జిల్లా బీజేపీ ఓబీసీ కార్యదర్శి చెన్నంశెట్టి ఉదయ్ కుమార్ విమర్శించారు. శనివారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడి ఆరు నెలలు గడస్తున్నా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయకపోవడంతో విద్యావ్యవస్థ విధంగాఉందో తెలుస్తుందన్నారు. రాష్ట్ర సర్కార్‌కు ఎక్సైజ్ శాఖ మీద ఉన్న శ్రద్ధ విద్యాశాఖ మీద లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఈశాఖకు పూర్తిస్థాయి మంత్రిని ఎందుకు నియమించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మంత్రిని నియమించాలని సూచించారు.

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

సిద్దిపేట టౌన్,జూన్ 15 : సిద్దిపేట వాసవి క్లబ్ సేవలు అభినందనీయమని క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు దర్శి శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట వాసవి, వనిత, యూత్ క్లబ్‌ల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రం సిద్దిపేటలో పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వేణుగోపాలాస్వామి, అన్నపూర్ణశ్వరి, వాసవిమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు.అనంతరం వీధి వ్యాపారులకు గొడుగులను, 60 మంది పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ,నోట్ బుక్స్,పాత బస్టాండ్ వద్ద ట్రాఫిక్ పోలీసులు మాస్కులను నిరుపేదలకు కిరాణ సామిగ్రి, దుస్తులు, బియ్యం,అన్నపూర్ణ పథకంలో భాగంగా వృద్ధులకు పెన్షన్లను పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు గంప శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షుడు రవి మర్యాల వాణి,క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బడీడు పిల్లల గుర్తింపునకు చర్యలు

సిర్గాపూర్, జూన్ 15 : మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో శనివారం బడిబాట కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ మేరకు స్థానిక ప్రాథమి క పాఠశాల ప్రధానోపాధ్యాయలు శాంతిబాయి ఆధ్వర్యంలో టీచర్లు బడీడు పిల్లలను గుర్తించేందుకు గ్రామంలో స్థానిక అం గన్‌వాడీ టీచర్ పార్వతీతో పాటు ఇంటింటా పర్యవేక్షించి చర్యలు తీసుకున్నారు. టీచర్లు విష్ణు నవనీత, అరుంధతి, రమ్య, సుభాష్ నాయక్ ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌నకు ఎంపిక

పుల్కల్,జూన్ 15 : 2023-24 విద్యా సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ నెలలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ టెస్టుకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు ఎనిమిదో తరగతి విద్యార్థులు హాజరు కాగా, అందులో నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ తెలిపారు. ఎంపికైన వారిలో సాయి వర్ష, మహాలక్ష్మి, సంజన,వర్షిత ఉన్నారు.

వరుస చోరీలతో గ్రామస్తుల బెంబేలు

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని కొండాపూర్ పోలీసులు
- సీసీ కెమెరాలో నిందితుడని గుర్తించిన బాధితులు
- పోలీసులకు చెప్పిన గ్యారెంటీ ఏమిటని ఎదురు ప్రశ్న
- డీఎస్పీకి ఫిర్యాదు చేసిన గొల్లపల్లి వాసులు

సంగారెడ్డి, జూన్ 15 : గ్రామాల్లో ఒకరి ఇంటి పక్కన దొంగతనం జరిగితే కొన్ని రాత్రులు దొంగలను పట్టుకునేందుకు గుంపులు గుంపులుగా తిరుగుతూ పహారా కాస్తారు. అదే వరుస దొంగతనాలు జరుగడంతో గ్రామస్తులు బెంబేలేత్తుతూ పోలీసులను ఆశ్రయించారు. దొంగతనాలు జరుగుతున్నాయని పోలీసులకు చెప్పినా పట్టించుకోవడంలేదని బాధితులు విమర్శిస్తున్నారు. చాకలి చంద్రయ్య ఇంటి అవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో దొంగ ఎవరు అనే వివరాలు గుర్తించి పోలీసులను సంప్రదించినా స్పందన లేదని వాపోయారు. మీరు చూపించిన వారే దొంగ అని రుజువు ఏమిటని బాధితులను పోలీసులు ఎదురు ప్రశ్నించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. అందుకే తమకు న్యాయం జరుగుతుందనే ఆలోచనతో డీఎస్పీ సత్తయ్యగౌడ్ కలిసి ఫిర్యాదు అందించామని తెలిపారు. కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో 6 నెలలుగా వరుస దొంగతనాలు జరుగుతున్నాయని కొండాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని బాధితులు అవేదన వ్యక్తంచేశారు. ఆరునెలల కింద గ్రామానికి చెందిన మైబూబీ అనే మహిళా కూలిపనితో జీవనం సాగిస్తూ ఒక్కో రూపాయిని జమ చేసుకున్నది. ఆమె ఇంట్లో లేనప్పుడు చూసిన వ్యక్తే దొంగతనం చేశాడని ఇరుగుపొరుగు ఇండ్ల వార్లు మైబూబీని ఓదార్చారు. అ తర్వాత గ్రామంలోని ముజాయత్ ఇంట్లో తమ్ముడు వివాహం కోసం తెచ్చిన నగదుతో పాటు బంగారాన్ని పెట్టి పెండ్లి బట్టలకు హైదరాబాద్‌కు 18ఏప్రిల్ 2024న వెళ్లారు. అదే రోజు రాత్రి12గంటలకు ఇంటికి వచ్చి పగిలిన తాళాన్ని చూసి ఒకేసారి బిత్తర పోయారు. దొంగతనం జరిగిందని గుర్తించి లబోదిబోమన్నారు. నగదు రూ.3లక్షలు, 8తులాల బంగారం, 30తులాల వెండి ఆభరణాలు దొంగలించారని అదేరోజు రాత్రి ఒంటిగంటకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 30న గ్రామంలోని గడల సదాశివుడి ఇంట్లో రూ.50వేలను దొంగలించారు. అ తర్వాత మంత్రిగారి శ్రీనివాస్ ఇంట్లో దొంగతనానికి రావడంతో ఇంట్లో సత్యమ్మ దొంగలు దొంగలు అని అరవడంతో పారిపోయారని బాధితులు గోడును వెల్లడించారు. గడీల సదాశివుడు ఇంటి సమీపంలో గొల్ల శేఖర్ కిరాణ దుకాణంలో దొంగతనం చేసి నగదు రూ.6 వేలు ఎత్తుకెళ్లారని వివరించారు. ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు దొంగలను పట్టుకునేందుకు విచారణ జరుగుతుందని బాధితులు అడిగితే చావు కబురు చల్లగా చెబుతూ వస్తున్నారు. ఇప్పటికైనా గొల్లపల్లి గ్రామంలో జరుగుతున్న దొంగతనాలపై కొండాపూర్ పోలీసులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. డీఎస్పీకి ఫిర్యాదు చేసిన వారిలో మాజీ సర్పంచ్ గడీల సదాశివగౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ చాకలి చంద్రయ్య, ముజాయత్, చంద్రమౌళి, రాములు తదితరులు ఉన్నారు.